క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : మండలంలోని అరమడకకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డిరెడ్డిగారి వెంకట్రమణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం మృతుడి స్వగృహానికి చేరుకొని పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్రంకొండలో బీజేపీ సంబరాలు

గుర్రంకొండ : హర్యానా రాష్ట్రంలో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధించడంపై గుర్రంకొండ పట్టణంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. మంగళవారం ప్రకటించిన హర్యానా ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం సాధించింది. ఈనేపథ్యంలో గుర్రంకొండలో ఆ పార్టీ నాయకుల సంబరాలు చేసుకొని అందరికి స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు రామాంజులు మాట్లాడుతూ మోదీ పరిపాలనను ప్రజలు ఆశీర్వదించడం వల్లనే హర్యానాలో వరుసగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజులు, భరత్, రెడ్డిముని నాయుడు, చింతిర్ల శ్రీనివాసులు, గౌరిశ్రీనివాసులు, వరదరాజులు, రెడ్డివెంకటేష్, రామ్మూర్తి, హరీష్, గోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థిని పవిత్ర

మదనపల్లె సిటీ : కేన్సర్ బాధితులకు మానసికంగా తోడుగా నిలవాలని హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పుంగనూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డి, విమల దంపతుల కుమార్తె పవిత్ర కేశాలను దానం చేశారు. స్థానిక హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో విద్యార్థినికి పూల మొక్క అందజేసి అభినందించారు. కేన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలువురు దాతలు ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కిరణ్, గుణ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో రైతు బజార్ ఏర్పాటు చేయాలి



బోదేషావలి

పీలేరు : పీలేరులో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదిషావలి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2022 అక్టోబర్ 10న జిల్లా మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు పీలేరులో రైతుబజారు ఏర్పాటుకు సంత వద్ద స్థల పరిశీలన చేసి ఆ ప్రాంతంలో 45 సెంట్లు భూమిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారని తెలిపారు. అయితే ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు, కూరగాయల ధరలు అధికమైనప్పుడు ప్రభుత్వం రైతు బజార్‌లలో సబ్సిడీతో కూరగాయలు అందిస్తుందని తెలిపారు. అలాంటి అవకాశం పీలేరు పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా యోగానంద్

పెద్దతిప్పసముద్రం : మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా యోగానంద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న కేఎస్ బాలాజీ పెద్దపంజాణి మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం ఎంపీడీఓగా నియమితులైన విష్ణు చిరంజీవి ఇంకా బాధ్యతలు చేపట్టక పోవడంతో ఈవోఆర్డీగా పని చేస్తున్న యోగానంద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె సిటీ : రాజమండ్రిలో ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల రిలే పరుగు పందెంలో మనోజ్, రుచిత, గాయిత్రి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని మంగళవారం కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ అభినందించారు.

కుంచించుకుపోయిన కురువంక

- ఆక్రమణల్లో వెలుస్తున్న నిర్మాణాలు
- నాడు వంక... నేడు కాలువ



ఇందిరానగర్ కురవంకలో ఆక్రమంగా వెలసిన భవనాలు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో విస్తరించి ఉన్న కురువంకలో అడుగడుగునా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 90 అడుగులున్న వంక ప్రస్తుతం 10 అడుగులు కూడా లేకపోవడం గమనార్హం. పొన్నూటిపాళ్యం పంచాయతీ రామిరెడ్డిగారి పల్లె చెరువు మొరవ నుంచి ప్రారంభమయ్యే ఎగువ కురవంక ప్రాంతం నుంచి మదనపల్లె పట్టణంలోకి ప్రవేశిస్తుంది. సొసైటీ కాలనీ సరిహద్దులో దిగువ కురవంకగా కదిరి రోడ్డును క్రాస్ చేస్తూ క్రిష్ణానగర్, ప్రశాంత్‌నగర్, ఇందిరానగర్‌ల మీదుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోని కోమటివానిచెరువు వరకు ఉంది. వర్షాధారంగా పొన్నేపాళ్యం, కోళ్లబైలు పంచాయతీల్లోని కొండల మీదుగా వచ్చే నీటితో చెరువులు నిండి ఈ వంకలో ప్రవహిస్తోంది.

రెండు వైపులా ఆక్రమణలు:

పి అండ్ టి కాలనీ చివరి నుంచి ఇందిరానగర్ వరకు వంకకు రెండు వైపులా అక్రమణ నిర్మాణలు వెలిశాయి. వంకలో ఫిల్లర్లు వేసి ఏకంగా పెద్ద పెద్ద భవనాలు నిర్మించారు. 90 అడుగులు ఉన్న వంక నేడు 10 అడుగుల విస్తరణకు పరిమితమైంది. వంక చిన్న కాలువగా మారిపోయింది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధింత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన పి అండ్ టి కాలనీ, ఎగువ కురవంకల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు ప్రవేశించాయి. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పర్యటించి అక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

పర్యవేక్షణ లేకనే..

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యదేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. వంకలను ఇరిగేషన్‌శాఖ పరిశీలించాల్సి ఉంది. పట్టణ పరిధిలో ఉండటంతో భవన నిర్మాణలను పరిశీలించి మున్సిపాలిటీ అనుమతులు ఇవ్వాల్సి వుంది. రెవిన్యూశాఖ సర్వే అధికారుల సమన్వయంతో వంకలు,వాగులు కాపాడాలి. సమన్వయలోపం కారణంగా కురవంక ఆక్రమణలను గురవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే పెద్ద ఎత్తున ప్రాణ,ఆస్తి నష్టం అయ్యే అవకాశాలున్నాయి. ఈవిషయమై తహసీల్దార్ ఖాజాబీని వివరణ కోరగా కురువంక ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : మామిడి సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చునని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గూడరేవుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మామిడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిలో ఒకేసారి పూత రావడానికి ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం (నైట్రేట్ మల్టీకే) 13.0.45ను 10 గ్రాములు, ఫార్ములా 4 గానీ, ఆర్కా మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పూత దశలో ఎలాంటి మందులు పిచికారి చేయాలన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, వీహెచ్‌ఏ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో కరెంటు బిల్లుకు స్వస్తి



మాట్లాడుతున్న ముత్యాల వంశీకృష్ణ

కురబలకోట : సోలార్ విద్యుత్‌తో పాతికేళ్ల వరకు పైసా కరెంటు బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని హైదరాబాద్ ప్రెయర్ ఎనర్జీ సర్వీసెస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ముత్యాల వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సోలార్ ఎనర్జీపై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సోలార్ విద్యుత్ వినియోగంలో ప్రపంచంలో మన దేశం నాలుగో స్థానంలో ఉందన్నారు. ప్రస్తుత రోజుల్లో ఏ ఇంటికైనా నెల వచ్చిందంటే మొదట భయపెట్టేది కరెంటు బిల్లేనన్నారు. సోలార్ వల్ల కరెంటు బిల్లు ఉండదు.. పవర్‌తో పనిలేదన్నారు. గృహ విద్యుత్ ప్రతి రాష్ట్రంలోను క్రమేణా పెరుగుతుందే తప్ప తగ్గదన్నారు. వినియోగదారులకు భారంగా మారుతోందన్నారు. కరెంటుకు బదులు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్‌ను వినియోగించడం శ్రేయస్కరమన్నారు. మిగిలిన సోలార్ విద్యుత్‌ను డిస్కంలకు కూడా అమ్మి సొమ్ము చేసుకోవచ్చన్నారు. ఇంటిపై ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే సోలార్ ప్యానళ్లు పాతికేళ్ల వరకు వినియోగంలో ఉంటాయన్నారు. ఇందుకు రాయితీపై కేంద్ర ప్రభుత్వం కొత్తగా సోలార్ రూఫ్‌టాఫ్ పథకం అమలు చేస్తోందన్నారు. అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకుని కరెంటు బిల్లుల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం కె.రామాపురం యూపీహెచ్‌సీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమాజంలో కలసిమెలసి జీవించే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను ఆయన వివరించారు. ఎయిడ్స్, సుఖ వ్యాధుల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వసీం, డాక్టర్ అబ్దుల్ లతీఫ్, పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, ఎంపీహెచ్ఏ(ఎఫ్), డబ్ల్యూహెచ్‌ఎస్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 44 దరఖాస్తులు

పీలేరు : పీలేరు సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలకు 44 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. పీలేరులో ఆరు, కలకడ రెండు, కేవీపల్లె ఒక షాపునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం వరకు గడువు ఉందని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితం

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు సురక్షితం. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆశా వర్కర్లదేనని డాక్టర్ పురుషోత్తం నాయక్, యస్దానీ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లతో వైద్య సిబ్బంది సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల శుభ్రత, మురుగు నీటి వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాటి నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులను రికార్డుల్లో సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు.

వీధి కుక్కల బెడద అరికట్టాలని వినతి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో వీధి కుక్కల బెడద అరికట్టాలని శేషప్పతోట రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కుక్కలు గుంపులు, గుంపులుగా ప్రజలపై దాడి చేస్తున్నాయన్నారు. అంతే కాకుండా పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై దాడి చేసి కరుస్తున్నాయన్నారు. ఎంతో మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సంఘమిత్ర నిధుల స్వాహాపై విచారణ



పోతపోలు గ్రామంలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె : పోతపోలు గ్రామ పంచాయతీలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సంబంధించి సంఘమిత్ర, నిధులు స్వాహాపై అందిన ఫిర్యాదుపై డీఆర్‌డీఏ అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. శ్రీనిధి మేనేజర్ హేమంత్‌రెడ్డి, ఏజీఎం ఉదయ్‌కుమార్, డీపీఎం ఫైనాన్స్ ప్రసాద్‌రెడ్డి, డీఎంజీ మధుబాబులు స్థానిక ఏపీఎం సుబ్రహ్మణ్యంతో కలిసి సంఘమిత్ర పుణ్యవతికి సంబంధించిన గ్రూపుల రికార్డులను పరిశీలించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆరోపణలకు సంబంధించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పోతబోలు సంఘమిత్ర పుణ్యవతి సభ్యులకు సకాలంలో రుణాలు మంజూరు చేయడంలేదని, గ్రూపుల నిర్వహణకు సంబంధించి పలు అవకతవకలకు పాల్పడుతోందన్నారు. రికార్డులు తారుమారు చేస్తూ, రెండు రికార్డులు నిర్వహిస్తోందని గ్రామస్తులు తెలిపారన్నారు. సంఘమిత్ర పుణ్యవతి అక్రమాలపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్‌కు పోతబోలు గ్రామదళితవాడ ప్రజలు పెట్టుకున్న అర్జీ మేరకు విచారణ నిర్వహించామన్నారు. విచారణలో తాము గమనించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీలను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత రామక్రిష్ణమాదిగ

రాయచోటి అర్బన్ : ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను బలోపేతం చేయాల్సిన బాధ్యత నేతలు, కార్యకర్తలపై ఎంతైనా ఉందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామక్రిష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని భానుహరి రెసిడెన్సీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ముఖ్యనాయకుల సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మందా క్రిష్ణమాదిగ నాయకత్వంలో 3 దశాబ్దాల మాదిగల పోరాటంతోనే సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పుచెప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాల ద్వారా చట్టబద్ధత చేసుకోవడం అందరి కర్తవ్యం అన్నారు. జాతి ఐక్యత, ఉజ్వల భవిష్యత్తు, పేద వర్గాల హక్కుల సాధనకు విద్యావంతులంతా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలంటూ కోరారు. జిల్లాలోని పాతకమిటీలను రద్దుచేసి ప్రతినాయకుడికి ఒక్క మండలం చొప్పున ఇన్‌చార్జి ఇవ్వడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా గ్రామకమిటీలు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన మండల కమిటీలు పూర్తిచేయాలంటూ కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రమాదిగ, ఎంఎస్‌పీ సీనియర్ నేత వెలగచర్ల శివయ్య, జిల్లా ఇన్‌చార్జ్ దమ్ము చిన్న, లాయర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నేతలు సి.వి.రమణ, సురేష్, వెంకటేష్, గండికోట వెంకటేష్, శ్రీనివాసులు, గురవయ్య, దొడ్డి వెంకటాచలపతి, ఆనంద్, చరణ్, రెడ్డికుమార్, నరసింహ, రాజశేఖర్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై హైకోర్టుకు నివేదిక



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి ప్రసూన

సుండుపల్లె : హైకోర్టు ఆదేశానుసారం వసతి గృహాలలో మౌలిక వసతులపై రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన తనిఖీ చేశారు. మండల పరిధిలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆమె పరిశీలించారు. ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు ప్రతిరోజు తాగునీరు బయట నుంచి తెప్పించుకుంటున్నామని వార్డన్ పూజారి రెడ్డయ్య ఆమెకు తెలియజేశారు. ఎస్సీ వసతి గృహానికి ప్రధాన గేటు, గదులలో ఫ్లోరింగ్, కిటికీలకు మెష్‌లు, మరుగుదొడ్లకు తలుపులు తదితర సమస్యలను గుర్తించామన్నారు. గిరిజన గురుకుల బాలుర వసతి గృహంలో ప్రహరీగోడ లేకపోవడం వలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం గుట్టకింద రాచపల్లి ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ప్రధానంగా ప్రతి వసతి గృహంలో తాగునీటి శుద్ధిచేసే యంత్రాలు లేక తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న ఆమె తెలిపారు. సమస్యలపై హైకోర్టుకు నివేదికను అందిస్తామని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్, హెడ్ కానిస్టేబుల్ బిడి నాయక్, వార్డన్‌లు పాల్గొన్నారు.

జగజ్జనని.. పాహిమాం



గుర్రంకొండ : దుర్గాదేవి అలంకారంలో పోలేరమ్మ



మదనపల్లె : సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు



వారాహీ అలంకారంలో లలితత్రిపురసుందరిదేవి



మదనపల్లె : శాకంబరి అలంకారంలో..



రామసముద్రం : ప్రత్యేక అలంకారంలో శ్రీమారెమ్మ



వాల్మీకిపురం: మహాలక్ష్మీగా నల్లవీరగంగాభవాని



దుర్గాదేవిగా కామేశ్వరి అమ్మవారు



కలికిరి : మహాలక్ష్మీగా దర్శనమిస్తున్న ఎల్లమ్మ తల్లి



గుర్రంకొండ : సరస్వతీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి



కేవీపల్లె : మహాలక్ష్మీ అలంకరణలో చౌడేశ్వరిదేవి



తంబళ్లపల్లె : కాళీమాత అలంకరణలో అమ్మవారు



పీలేరు : రాజరాజేశ్వరిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

మదనపల్లె సిటీ : జగమేలే జగజ్జననికి జేజేలు పలుకుతూ భక్తజనం నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారిని శ్రీ సంతాన లక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక అప్పారావువీధి, అప్పారావుతోట, దేవళంవీధి, త్యాగరాజువీధి ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం వారిచే సరస్వతిదేవి అలంకరణతో చేసిన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. స్థానిక చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని శాఖంబరి అలంకారం చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో లలితత్రిపురసుందరిదేవి అమ్మవారిని వారాహీ అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక సిటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మి అలంకారం చేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయం, కోర్టు ఆవరణంలోని గంగమ్మ, భువనేశ్వరి నగర్‌లోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రీమారెమ్మ ఆలయంలో..

రామసముద్రం : మండలంలోని తిరుమలరెడ్డిపల్లిలో వెలసిన శ్రీమారెమ్మ ఆలయంలో దసరా వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే రామసముద్రం దిగువపేటలో శ్రీచంద్రశేఖరస్వామి ఆలయంలో అర్చకులు బాలస్వామి ఆధ్వర్యంలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించారు. పార్వతిదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు చేశారు.

రాజరాజేశ్వరిదేవి అలంకరణలో..

పీలేరు రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మంగళవారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మీ అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించి లలితాదేవి అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాలక్ష్మీ అలంకరణలో నల్లవీరగంగాభవాని

వాల్మీకిపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయంలో గంగాభవాని అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు దుర్గాదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో రాజరాజేశ్వరి దేవిగా, గండబోయనపల్లిలోని సత్యమ్మ తల్లి మహాలక్ష్మీదేవి, గొళ్లపల్లిలోని విరూపాక్షమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవి, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చన, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పూజార్లు జనార్దన్, ఉత్తన్న, అర్చకులు శీనాస్వామి, సుధీర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ రూపంలో ఎల్లమ్మ తల్లి

కలికిరి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజా కార్యక్రమాల అనంతరం రూ.100, 200, 50, 20, 10 నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. డబ్బునోట్లతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తిచూపారు. సోమేశ్వరస్వామి ఆలయంలో దుర్గామాత ప్రతిమలను ఏర్పాటు చేసి నవరాత్రి పూజలు, రాత్రి లలిత కుంకుమార్చన నిర్వహించారు.

సరస్వతీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజైన మంగళవారం గుర్రంకొండ గ్రామదేవత శ్రీపోలేరమ్మతల్లి దుర్గాదేవి అలంకారంలో, మరో గ్రామదేవత శ్రీ గంగమ్మ తల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయాల్లో అమ్మవారి కీర్తనలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మహాలక్ష్మీ అలంకరణలో చౌడేశ్వరిదేవి

కేవీపల్లె : మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

కాళీమాత అలంకరణలో అమ్మవారు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని శివాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా పార్వతిదేవిని ఆలయంలో కొలువుదీర్చారు. మంగళవారం అర్చకులు మహేష్ అమ్మవారికి కాళీమాత అలంకరణ చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

అమ్మవారికి గవ్వలతో అలంకరణ

పెద్దతిప్పసముద్రం : భక్తులను కరుణించే జగన్మాత శరన్నవ రాత్రి ఉత్సవాలు కనుల పండుగగా సాగుతున్నాయి. పెద్దతిప్పసముద్రంలోని శివాలయం సేవకులు ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీ అమ్మవారికి గవ్వలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.